సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



5 టౌన్‌లకు అమృత్ నిధులు

పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు పట్టణాల్లో అమృత్ పథకం 2.0లో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 8లో ▸



మద్ది క్షేత్రం కిటకిట

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం లోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రానికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిటకిటలాడింది.

రైతుకు చెక్కు అందజేత



ద్వారకాతిరుమల: పులి దాడిలో దూడ చనిపోవడంతో బాధిత రైతు ముక్కవల్లి బాల సుందరానికి ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్ర ధామ్ మంగళవారం రూ.10 వేలు నష్ట పరిహారం చెక్కును అందజేశారు.

న్యూస్‌రీల్

శరవేగంగా రోడ్డు నిర్మాణం



డీమార్ట్ నుంచి విష్ణు కళాశాల వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో డీమార్ట్ నుంచి విష్ణు కళాశాల వరకు భీమవరం–తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిలో 2.7 కిలోమీటర్ల మేర రూ.మూడు కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండటం, గోతులతో ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులతో పలుమార్లు సమీక్షించి ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. రోడ్డు అభివృద్ధి చేయడంపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న పోస్టు కమాండర్ దస్తగిరి

భీమవరం (ప్రకాశంచౌక్): రైల్వేలో మానవ అక్రమ రవాణా కట్టడికి ప్రయాణికులు సహకరించాలని భీమవరం ఆర్పీఎఫ్ పోస్టు కమాండర్ ఎస్‌కే దస్తగిరి కోరారు. మానవ అక్రమ రవాణ నిర్మూలనపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్, సెంట్రలైజ్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ మంగళవారం స్థానిక టౌన్ రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ కార్యాలయంలో ప్రయాణికులు, ఆటోడ్రైవర్లు, రైల్వే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. బచపన్ బచావో ఆందోళన్ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మానవ అక్రమ రవాణా నిర్మూలనకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఆర్పీఎఫ్ సహకారంతో ఏడాది కాలంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 378 మందిని అక్రమ రవాణా బారి నుంచి కాపాడామన్నారు. వారిలో విజయవాడ డివిజన్ పరిధిలో దాదాపు 200 మందిని రక్షించామన్నారు. ఎవరిపైనా అనుమానం కలిగితే వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139, పోలీస్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ చౌదరి, జీఆర్పీ ఎస్‌ఐ పీటీవీ రమణ, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఒడితో నిశ్చింత

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు.. ప్రతి తల్లీ తన బిడ్డలను పెద్ద చదువులు చదివించుకోవాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలుచేస్తున్న అమ్మ ఒడి పథకం పేదల ఇంట కొత్త వెలుగులు విరజిమ్ముతోంది. వారి బిడ్డల భవిష్యత్తుకు కొండంత భరోసానిస్తోంది. పుట్టిన బిడ్డకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ మొదలు వారి ఉన్నత చదువులు వరకు జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యా, వసతి, విదేశీ విద్యా దీవెన పథకాలతో అవసరమైన అన్ని ప్రభుత్వమే సమకూరుస్తుండటంతో ప్రభుత్వ సాయాన్ని పేదింటి తల్లులు తమ పిల్లల భవిష్యత్ అవసరాల కోసం వెచ్చిస్తున్నారు. కొందరు తమ పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల కోసం పోస్టాఫీసులు, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుంటే, మరికొందరు ఆడపిల్లలకు బంగారు వస్తువులు సమకూర్చుకుంటున్నారు.

- బిడ్డల భవిష్యత్‌కు భరోసాగా అమ్మ ఒడి పథకం
- ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు ప్రభుత్వ సాయం
- జిల్లాలో నాలుగు విడతల్లో 1,48,342 మంది తల్లుల బ్యాంక్ ఖాతాలకు రూ.887.9 కోట్ల జమ
- జగన్ పాలనలో పిల్లల భవిష్యత్‌పై భయం లేదంటున్న పేదలు

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు

	2020		2021		2022		2023	
నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
ఆచంట	20,868	31	35,048	53	21,927	33	20,794	31
భీమవరం	21,552	32	8,910	13	22,138	33	21,315	32
నర్సాపురం	17,555	26	10,866	16	17,967	27	17,138	26
పాలకొల్లు	16,408	25	24,361	37	16,323	24	15,504	23
తాడేపల్లిగూడెం	21,367	32	9,831	15	21,450	32	20,439	31
తణుకు	22,420	34	14,862	22	22,898	34	21,814	33
ఉండి	22,765	34	42,276	63	22,758	34	21,606	32
గణపవరం మండలం	4,965	7.44	5,247	7.87	5,075	7.61	4,924	7.38

సాక్షి, భీమవరం: గతంలో పేద కుటుంబాల వారు తమ పిల్లలను చదివించాలంటే ఇబ్బంది పడేవారు. కొందరు చదువులు మధ్యలోనే మాన్పించేసి పిల్లలను పనులకు పంపేవారు. పేదల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్ చదువుకునేలా వారిని ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ. 15 వేలు చొప్పున అందజేస్తున్నారు. గత నాలుగు విడతల్లో 1,48,342 మంది తల్లుల ఖాతాలకు రూ. 887.9 కోట్లు జమ చేశారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల అవసరాల కోసం వీటిని వినియోగిస్తుండగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లులకు అదనపు సాయం అవుతున్నాయి. ప్రభుత్వ సాయానికి తమ రెక్కల కష్టం జోడించి తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. వారి పైచదువులు, పెళ్లిళ్ల సమయానికి చేతికందేలా బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో డిపాజిట్లు చేసుకోవడం, ఆడ బిడ్డలకు అవసరమైన బంగారు వస్తువులు కొనుగోలు చేయడం చేస్తున్నారు.

ఇదీ మార్పు

పిల్లల భవిష్యత్‌పై చింత లేదు



ముగ్గురు కుమార్తెలతో రాంబాబు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది భావన రాంబాబు. ఇరగవరం మండలం కావలిపురం గ్రామం. ఇతనికి ముగ్గురు ఆడపిల్లలు. నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణ భారమై భార్య ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. అక్కడ ఆమె ఇబ్బందులు చూసి ఇక్కడ తల్లడిల్లిపోయేవాళ్లం. పిల్లల చదువులు భారంగా మారడంతో వారిని చదువు మానిపించేద్దామనుకున్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సంక్షేమ పథకాలతో భరోసా ఇవ్వడంతో పిల్లల చదువుల కోసం ఖర్చు తప్పింది. ప్రస్తుతం పెద్ద కుమార్తె ఎనిమిదో తరగతి, రెండో కుమార్తె ఐదో తరగతి, మూడో కుమార్తె మూడో తరగతి చదువుతున్నారు. అమ్మ ఒడి సాయంతో పాటు వారికి అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రి అందిస్తున్నారు. పాఠశాలలోనే నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరడంతో వచ్చే సంపాదన వస్తోంది. అమ్మ ఒడి సాయం సొమ్ముకు కొంత జమచేసి పోస్టాఫీసులో ముగ్గురు పిల్లల పేరిట డిపాజిట్ చేశారు. కుమార్తెల వివాహ సమయానికి ఈ సొమ్ములు చేతికందనుండటంతో పిల్లల పెళ్లిళ్లు ఎలా చేయాలన్న చింత కూడా తనకు లేదంటున్నాడు భావన రాంబాబు.

పిల్లల చదువుకు భయం లేదు



నా భర్త మూడెకరాలు కౌలుకు వ్యవసాయం చేస్తుంటారు. ఆడ పిల్లలు ఇద్దరిని మంచి చదువులు చదివించాలన్న ఆశ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో ఎలా అని భయపడేవాళ్లం. జగనన్న వచ్చాక ఆ భయం లేకుండా చేశారు. అమ్మ ఒడి పథకం కింద ప్రతి ఏడాది రూ. 15 వేలు ఆర్థికసాయం అందిస్తున్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, షూలు ఇస్తుండటంతో పాటు పాఠశాలలోనే మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. అమ్మ ఒడి సాయంతో ఆడపిల్లల రేపటి భవిష్యత్తుకు భరోసా దక్కింది. ఈ సొమ్ములతో బంగారం కొనడం, పిల్లల అవసరాలకు వినియోగిస్తున్నాం.

– జక్కంశెట్టి పద్మ, ఇరగవరం

పాపకు బంగారం కొన్నాం



ఎలాగైనా పాపకు బంగారం కొనాలన్న కోరిక ఉండేది. నా భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ తెచ్చే జీతం ఇంటి అవసరాలకే సరిపోతోంది. జగనన్న వచ్చాక మా కల నెరవేరింది. అబ్బాయి (10వ తరగతి), అమ్మాయి (5వ తరగతి) ఇద్దరిని ప్రభుత్వ పాఠశాలలోనే ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నారు. చదువుకు అవసరమైన అన్నీ ప్రభుత్వమే అందిస్తుండటంతో అమ్మ ఒడి సొమ్ముతో మా అమ్మాయికి బంగారపు చెవి రింగులు కొన్నాం. ఆమె భవిష్యత్తు కోసం మిగిలిన సొమ్ములు బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నాం. మాలాంటి పేదలకు ఈ ప్రభుత్వం వలన ఎంతో మేలు జరుగుతోంది.

– టి.గౌరి, ఉండి

పాప పేరిట దాస్తున్నాం



నా భర్త చిన్న ప్రైవేట్ ఉద్యోగి. ఒక్కగానొక్క కుమార్తెను కార్పొరేట్ స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియంలో చదివించాలన్న ఆశ ఉన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చేర్పించలేదు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో మా కోరిక నెరవేరింది. మా అమ్మాయి ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. అమ్మ ఒడి సాయం సొమ్ముతో నా కుమార్తె స్కూల్‌కు వెళ్లేందుకు సైకిల్ కొనిచ్చాం. మిగిలిన సొమ్మును ఆమె కోసం బ్యాంకులో దాస్తున్నాం. సొంత మేనమామలా పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో గొప్పగా ఆలోచన చేస్తున్న సీఎం జగన్ సర్‌కు రుణపడి ఉంటాం.

– ఆలమూరి సుధ, ఎన్నార్పీ అగ్రహారం

సొంత మేనమామలా..



నా భర్త పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అబ్బాయి 10వ తరగతి, అమ్మాయి 8వ తరగతి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాల కన్నా చాలా బాగా అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. ఖర్చులు ఏమీ లేకుండానే పిల్లలకు సొంత మేనమామలా జగన్ సర్ నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్నారు. అమ్మ ఒడి సొమ్మును నా కుమార్తె కోసం వినియోగిస్తున్నాం. స్కూల్‌కు వెళ్లేందుకు సైకిల్ కొన్నాం, చెవి రింగులు కొన్నాం.

– ఎ.సాయిజ్యోతి, యలమంచిలి

జగన్ మావయ్యే చదివిస్తాడు



నా భర్త పెయింటింగ్ పనిచేస్తుంటారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. మా కుటుంబంలో ఎవరూ పెద్దగా చదివింది లేదు. మా పిల్లలను బోర్డు స్కూల్ చదువులకే పరిమితం చేద్దామనుకున్నాం. జగనన్న వచ్చాక మా ఆలోచనలు మారాయి. ప్రభుత్వ పాఠశాలలో చక్కని చదువు చెబుతున్నారు. అవసరమైన పుస్తకాలు, షూలు, బ్యాగులు అన్నీ ఇస్తున్నారు. అమ్మ ఒడి సొమ్ములను కుమార్తె భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేస్తున్నాం. 'మీరేం చదివించాల్సిన అవసరం లేదు.. జగన్ మావయ్యే చదివిస్తాడు' అని మా కుమార్తె ధైర్యంగా చెబుతోంది.

– బి.మార్తమ్మ, మాగొల్లు

29లోగా కార్మిక శాఖ రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

ఏలూరు (టూటౌన్): కార్మిక శాఖ జోన్–2 ఏలూరు పరిధిలోని ఏడు జిల్లాల్లో దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు, కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు ఈ నెల 29లోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని జోన్–2 ఏలూరు సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి కోరారు. ఏలూరు అశోక్ నగర్‌లోని జేసీఎల్ కార్యాలయంలో వివిధ వర్తక, వాణిజ్య యాజమాన్య సంఘాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జోన్–2 పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు గతంలోనే ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉంటే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. గతంలో విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద కార్మిక చట్టాలన్నింటికీ ఒకే రిజిస్ట్రేషన్/లైసెన్స్ పొందే వెసులుబాటు ఉందన్నారు. ఈ చట్టం కింద సంస్థల రిజిస్ట్రేషన్/రెన్యువల్ కోసం యజమానులు లేదా కాంట్రాక్టర్లు సమీపంలోని మీ–సేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. లైసెన్స్, రిజిస్ట్రేషన్, నవీకరణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు



ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

పెనుగొండ: రాష్ట్రంలోనూ, ఆచంట నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఆచంట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం ఆచంట మండలం కందరవల్లికి చెందిన టీడీపీ నాయకులు గంధం నాగభూషణప్రసాద్, గంధం సత్యనారాయణ, కంతంశెట్టి ఆదినారాయణ, గంధంనాగేశ్వరరావు, గంధం నాగరాజు, కంతంశెట్టి సుబ్బారావు, గంధం సత్యనారాయణలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రతి కుటుంబానికీ మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండడానికి నిర్ణయించుకున్నారన్నారు. టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేయడం ఖాయమన్నారు. గ్రామ సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, పార్టీ అధ్యక్షుడు బోడపాటి సత్యనారాయణ, యర్రగోపుల లక్ష్మీనారాయణ, రావినాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు పట్టాలి

భీమవరం: ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహించాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 114 మంది క్రీడాకారులు ఈనెల 9న విశాఖపట్టణలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు ఈ నెల 8న బస్సుల్లో క్రీడాకారులు తరలివెళతారన్నారు.

అక్కచెల్లెమ్మలకు బాసటగా ఆసరా

జిల్లాలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. డ్వాక్రా మహిళలకు గత ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ సొమ్మును వైఎస్సార్ ఆసరా పథకం రూపంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడంతో అక్కచెల్లెమ్మల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు జగనన్నకే అంటూ మహిళలు నినదిస్తున్నారు. మంగళవారం ఉండి, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఆసరా సంబరాలు జరిగాయి.

– ఉండి/పాలకొల్లు/పెనుగొండ



ఉండిలో ఆసరా సంబరాల సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

జగనన్నతో మనోధైర్యం



జగనన్న పాలనలో మహిళలంతా మనోధైర్యంతో బతుకుతున్నారు. గతంలో అప్పుల పాలైన మహిళలు ఇప్పుడు జగన్ దయవల్ల పింఛన్, వైఎస్సార్ ఆసరా, భరోసా, ఇంటిస్థలం ఇలా అనేక విధాలుగా సాయం అందిస్తూ ఆదుకుంటున్నారు.

– బొద్దు సూరమ్మ, కృష్ణవేణి పుష్కర డ్వాక్రా గ్రూపు, యండగండి

మహిళలకు అండగా నిలుస్తున్నారు



బిడ్డగా, అన్నగా రాష్ట్రంలో మహిళలకు సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు సీఎం వైఎస్ జగన్ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఎంతో గౌరవాన్ని, ఆర్థిక భరోసాను కల్పిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి వచ్చేలా మహిళలంతా మద్దతుగా నిలుస్తాం.

– బాతు శిరోమణి, శాంతి డ్వాక్రా గ్రూపు, కలిసిపూడి

అర్హత ఉన్న ప్రతివారికీ సంక్షేమ పథకాలు

వైఎస్ జగన్ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతివారికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఏటా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అందిస్తున్నారు. అక్కచెల్లెమ్మలను లక్షాధికారులుగా చేశారు.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

(ఉండిలో మంగళవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో)



ఉండిలో ఆసరా చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు, పరిశీలకురాలు శ్రీలక్ష్మి

మహిళల సంక్షేమానికి పెద్దపీట

మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు రుణ మాఫీ చేసి ఆదుకున్నారు.

– గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి

(పాలకొల్లులో మంగళవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో)



పాలకొల్లు ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

మహిళా పక్షపాతి సీఎం జగన్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళలకు సంక్షేమ లబ్ధిని అందించడంతో పాటు, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీని అమలు చేశారు. మహిళ పక్షపాతిగా మహిళల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నారు.

– చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే, ఆచంట

(తూర్పుపాలెంలో మంగళవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో)



తూర్పుపాలెంలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

క్లుప్తంగా

పాత్రికేయులపై దాడికి ఖండన



డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

పోలవరం రూరల్: చింతలపూడిలో టీడీపీ 'రా.. కదిలిరా' బహిరంగ సభలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విలేకరులపై చేసిన దౌర్జన్యాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజవర్గ కార్యదర్శి పూనేం చిన్న బుచ్చన్న దొర, జిల్లా జాయింట్ సెక్రెటరీ కుంజం రాంబాబు, పోలవరం ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ సోబ్బన రాజశేఖర్‌బాబు, ప్రెస్‌క్లబ్ సభ్యులు చింతమనేని ప్రభాకర్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. పాత్రికేయులపై మరోసారి ఇటువంటి ఘటన జరగకుండా చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మార్చి 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్ నందు మంగళవారం ఏలూరు కోర్టు పరిధిలోని పోలీస్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు కోర్టులకు సంబంధించి క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం దృష్టి సారించాలన్నారు. పోలీసులు 378 కేసులను రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించడం జరిగిందని, ఈ కేసులు ఏలూరులోని వివిధ కోర్టుల్లో పెండింగ్ ఉన్నాయన్నారు. కక్షిదారులు రాజీయోగ్యమైన అన్ని కేసులలో సంబంధిత కోర్టుల ద్వారా గాని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా గానీ రాజీ చేసుకొనుటకు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో ఏలూరు పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

ఐదు పట్టణాలకు అమృత్ 2.0 నిధులు

- రూ.286.54 కోట్లతో మంచినీటి, మురుగునీటి వ్యవస్థల అభివృద్ధి
- మొత్తం 11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఇప్పటికే మూడు ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం
- నెలాఖారులోగా మిగిలిన డీపీఆర్‌లు పూర్తిచేసేందుకు చర్యలు



భీమవరం పట్టణ వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఐదు పట్టణాలను అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసి తాగునీటి సురక్షిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 పథకంలో రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీనిలో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో మంచినీటి సరఫరా, కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైప్‌లైన్ల విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం (ఎస్టీపీల నిర్మాణం), నీటి సంరక్షణ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, జగనన్న కాలనీల్లో ఎస్టీపీల నిర్మాణం తదితర పనులు చేయనున్నారు.

11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు తయారీ

జిల్లాలోని ఐదు పట్టణాలను అమృత్ 2.0 పథకంలో మొత్తం 11 ప్రాజెక్టులుగా విభజించారు. పట్టణాల్లో, జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులకు విడివిడిగా నిధులు మంజూరు చేయడం జరిగింది. 11 ప్రాజెక్టు పనులకు ప్లబిక్ హెల్త్ శాఖ అధికారులు డీపీఆర్‌లు (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారుచేస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌లు పూర్తి చేసి సాంకేతిక మంజూరు చేయడం జరిగింది. అందులో తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు ఉన్నాయి. ఈనెలాఖరులోపు మిగిలిన 8 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు తయారుచేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

205–26 వరకు సమయం

అమృత్ 2.0 ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి వచ్చేఏడాది 2025–26 వరకు సమయం ఉంది. ఈఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి అమృత్ 2.0 ప్రాజెక్టు వేగవంతం చేయడానికి అధికారులకు సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు.

మూడు ఎస్టీపీలు

అమృత్ పథకంలో జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడు చోట్ల ఎస్టీపీలు(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మించనున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.100 కోట్లతో భారీ ఎస్టీపీ నిర్మాణం, జగనన్న కాలనీలో రూ.12.19 కోట్లతో, భీమవరం జగనన్న కాలనీలో రూ.13.39 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించనున్నారు.

పట్టణాల వారీగా పనులు

పట్టణం	అమృత్ 2.0 నిధులు	పనులు
భీమవరం	రూ.65.48 కోట్లు	రూ 4.8 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు
		రూ.13.39 కోట్లతో జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్
		రూ.47.29 కోట్లతో నీటి సరఫరా అభివృద్ధి పనులు
తాడేపల్లిగూడెం	రూ.159.28 కోట్లు	రూ.41.79 కోట్లతో నీటి సరఫరా పనులు
		రూ 12.19 కోట్లతో జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్
		పట్టణంలో రూ 100.2 కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్
		రూ 5.1 కోట్లతో జగనన్న కాలనీలో నీటి సరఫరా పనులు
నర్సాపురం	రూ.21 కోట్లు	నీటి సరఫరా అభివృద్ధి పనులు
ఆకివీడు	రూ.32.42 కోట్లు	నీటి సరఫరా అభివృద్ధి పనులు
తణుకు	రూ.8.36 కోట్లు	జగనన్న కాలనీలో నీటి సరఫరా అభివృద్ధి పనులు

నెలాఖరులోగా టెండర్లు ప్రారంభిస్తాం



అమృత్ 2.0 పథకంలో ఐదు పట్టణాలకు సంబంధించి 11 ప్రాజెక్టులు ఉంటాయి. వాటికి సంబంధించి డీపీఆర్‌లు ఇప్పటికీ మూడు పూర్తిచేయడం జరిగింది. మిగిలిన వాటికి డీపీఆర్‌లు తయారు చేస్తున్నాం. ఈనెలాఖరులోపు డీపీఆర్‌లు పూర్తి చేసి వచ్చే నెలలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలే చర్యలు తీసుకుంటున్నాం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థ మెరుగుపర్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2025–2026 కల్లా ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది.

– ఆర్.విజయ్, ప్లబిక్ హెల్త్ డీఈ, పశ్చిమగోదావరి జిల్లా

దివ్యాంగ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న రాకాడ మణి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుడైన మైలే డేవిడ్ జార్జి ప్రైస్ అనే విద్యార్థికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమాధికారి పి.రాకడ మణి మంగళవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పించిందని, ఇందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం కోటలపర్రు గ్రామానికి చెందిన బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థి మైలే డేవిడ్ జార్జి ప్రైస్‌కి ల్యాప్‌ట్యాప్ అందించామన్నారు. ప్రభుత్వం తనకు ల్యాప్‌టాప్ మంజూరు చేసి తన విద్యకు ఎంతో మేలు చేసిందని జార్జి ప్రైస్ సంతోషం వ్యక్తం చేశాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని నల్లంవారితోటకు చెందిన జె.నాగరాజు (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత స్నానానికి వెళ్లి ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చి ఇంటి వెనక్కి వెళ్లి చూడగా వేప చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతు ఉన్నట్లు అతని భార్య దుర్గామల్లేశ్వరి ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గిరిజన గ్రామాల్లో ఉద్యాన పంటలు పెంచాలి

జాతీయ వ్యవసాయ కీటక వనరుల బ్యూరో సంచాలకులు డాక్టర్ ఎస్ఎన్ సుశీల్



గిరిజన ఉప ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న డాక్టర్ సుశీల్, ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: గిరిజన గ్రామాల్లో ఉద్యాన పంటలు పెంచేలా చర్యలు చేపట్టాలని జాతీయ వ్యవసాయ కీటక వనరుల బ్యూరో సంచాలకులు డాక్టర్ ఎస్ఎన్ సుశీల్ అన్నారు. మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన పరిశోధన స్థానంలో గిరిజన ఉప ప్రణాళిక, ఎస్టీ ఉపప్రణాళికల అమలుపై ఉద్యాన పరిశోధన స్థానం అంబాజీపేట, కేవీకే వెంకట్రామన్నగూడెం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుశీల్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఉద్యాన పంటల్లో పురుగులు, తెగుళ్ల సమగ్ర యాజమాన్యానికి రసాయన ఎరువుల వినియోగం కంటే, జీవ నియంత్రణ కారకాల వినియోగంపై అవగాహన పెంచాలన్నారు. దీని వల్ల సాగు ఖర్చు నియంత్రించడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని, ఈ దిశగా రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోలవరం ముంపు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన కాలనీలలో కొబ్బరి, నిమ్మ, చెర్రీ, వాక్కాయ, కరివేపాకు మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ సంచాలకులు మీరా, ఉద్యానవర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్, విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, పరిశోధన సంచాలకులు నారం నాయుడు తదితరులు హాజరయ్యారు.

జిల్లాలు దాటి పింఛన్ అందజేత



యలమంచిలి: కాకినాడ వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కొయ్యే ధరణి



పాలకొల్లు సెంట్రల్: గుంటూరు జిల్లా తెనాలి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు

యలమంచిలి: ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నారు వలంటీర్లు. ఒకవేళ ఏ కారణం చేతనైనా లబ్ధిదారులు అందుబాటులో లేకుంటే వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసి వలంటీర్లు మానవతా దృక్పథం చాటుకుంటున్నారు. యలమంచిలి మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన ఖండవల్లి జాన్ పింఛన్ లబ్ధిదారు. ఆయన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మెదడుకు శస్త్రచికిత్స చేయించుకుని అక్కడ వైద్యం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ కొయ్యే ధరణి మంగళవారం కాకినాడ వెళ్లి జాన్‌కు పింఛన్ అందజేసింది. వ్యయప్రయాసలకు ఓర్చి అంతదూరం వచ్చి పింఛన్ ఇచ్చిన వలంటీర్ ధరణికి జాన్‌తోపాటు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు వెళ్లి మరీ..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పింఛన్ లబ్ధిదారు వెదురుపర్తి కృష్ణవేణి అనారోగ్యంతో తెనాలి వద్ద కాలెవరం పంచాయతీ ఎరకలపూడి గ్రామంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో సోమవారం వలంటీర్లు గజ్జరపు వాసవి, మిద్దే శిరీష ఇద్దరూ కలిసి ఎరుకలపూడి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసి వచ్చారు. ఆమె కుటుంబ సభ్యులు వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

12న క్రికెటర్ల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: త్వరలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బాలుర క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జి ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 16 ఏళ్ల లోపు వయస్సు క్రికెటర్లను జట్లుగా విభజించి పోటీలు చేపడతామని వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీన భీమవరం డీఎన్ఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు చేపడతామని వివరించారు. భీమవరం, ఉండి, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, పెనుగొండ, అత్తిలి ప్రాంతాల క్రికెటర్లు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గలవారు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ ఒరిజినల్స్, జెరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం కోచ్‌లు ఎం.నాగవర్మ 94939 62833, టి.శ్రీనివాస్ 91105 02929 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

'సిద్ధం' సభలతో ప్రతిపక్షాలు వణికిపోతున్నాయ్



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సిద్ధం సభ ద్వారా భీమిలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రైలర్ చూపిస్తే దెందులూరులో జరిగిన సభ ద్వారా జగన్ సినిమా చూపించారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన తాడేపల్లి ప్యాలెస్ వదలి బయటకు రారని చంద్రబాబు, వారి బ్యాచ్ మాట్లాడారని, జగన్ బయిటకు వస్తే ఎలా ఉంటుందో ఇటీవల జరిగిన సభల ద్వారా ప్రత్యక్షంగా చూశారన్నారు. సిద్ధం సభలకు వచ్చిన జనసంద్రాన్ని చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తి వారి సొంత రాష్ట్రాలకు పోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. గతంలో టీడీపీ నాయకులు పవన్ కళ్యాణ్ తల్లిపై అవమానకరంగా మాట్లాడితే తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేస్తానని చెప్పిన పవన్ నేడు యూటర్న్ తీసుకొని టీడీపీకి మద్దతు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభిమానులు ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తుంటే పవన్ మాత్రం చంద్రబాబు వద్ద ప్యాకేజీ స్టార్‌గా మారారన్నారు. దీంతో జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. షర్మిల సొంత అన్నయ్య, సీఎం జగన్‌పై విష ప్రచారం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రతిపక్షాలకు నియోజకవర్గాలలో అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, షర్మిల, పురందేశ్వరీ ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సునీల్‌కుమార్, సునీల్ బాబు, సందీప్ చిట్టి రాజు, రోహిత్, పాల్గొన్నారు.

పీడీఎస్ రైస్ స్వాధీనం



రైస్ స్వాధీనం చేసుకున్న అధికారులు

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ చేసి ఉంచిన పీడీఎస్ రైస్‌ను అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కన్నాపురంలో గ్రంధి శ్రీనివాసరావు ఇంటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు సంయుక్తంగా దాడిచేశారు. గోడౌన్‌లో మూడు టన్నుల బియ్యం అక్రమ నిల్వలను గుర్తించారు. గ్రంధి శ్రీనివాసరావుపై 6(ఎ), 7(1) కేసులు నమోదు చేశారు. సరుకు విలువ రూ.1,20,000 ఉంటుందని అంచనా. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, సీఎస్ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారు ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరెడ్డి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురం సమీపంలో బ్రిడ్జి వద్ద కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. వివరాల ప్రకారం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొండ రెడ్డి గిరిజనుడు కోపల వెంకటరెడ్డి (32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రెడ్డిగూడెం నుంచి కొవ్వాడ వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు 108కు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడ్ని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న చెప్పారు. కాగా ఆ కొత్త కారును నడిపింది టీడీపీకి చెందిన ఒక వ్యక్తి అని సమాచారం.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ టెన్నీకాయిట్ పోటీలు



అండర్-17 బాలుర విభాగంలో ప్రథమస్థానం సాధించి బహుమతి అందుకున్న శ్రీకాకుళం జట్టు

జంగారెడ్డిగూడెం: మూడు రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ టెన్నీకాయిట్ అండర్-14, అండర్-17 బాలబాలికల పోటీలు మంగళవారంతో ముగిశాయి. రాష్ట్ర పరిశీలకులు ఎస్‌టీ ప్రసాద్ ఈ పోటీలను పర్యవేక్షించారు. ఏలూరు జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ డీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాకుళం ప్రథమస్థానం, తూర్పుగోదావరి జిల్లా ద్వితీయస్థానం, పశ్చిమగోదావరి జిల్లా తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. అలాగే అండర్-17 బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా ప్రథమ స్థానం, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, అనంతపురం జిల్లా తృతీయ స్థానం సాధించాయన్నారు. అదేవిధంగా అండర్-14 కేటగిరీలో బాలుర విభాగంలో అనంతపురం, తూర్పుగోదావరి, కడప జిల్లా వరుస స్థానాలు సాధించగా, బాలికల విభాగంలో అనంతపురం, చిత్తూరు, కృష్ణా జిల్లాలు వరుసస్థానాలు సాధించినట్లు చెప్పారు. విజేతలకు జెడ్పీహైస్కూల్ హెచ్ఎం లోవకుమారి, ఎస్‌టీ ప్రసాద్‌ల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ సభ్యులు ప్రకాష్, రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ ట్రెజర్ తలిటియ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలివేలో కొబ్బరి చిప్పల సేకరణ హక్కుకు బహిరంగ వేలం

ముసునూరు: మహాశివరాత్రి సందర్భంగా చారిత్రక ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో నిర్వహించనున్న బలే రామలింగేశ్వరస్వామి ఉత్సవాలలో మార్చి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొబ్బరి చిప్పల సేకరణ చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్సవ ప్రాంగణంలో కొబ్బరి చిప్పల సేకరణకు ఈవేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగల వారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించి, సకాలంలో వేలంకు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

తణుకులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ప్రారంభం


బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న రఘువీర్

తణుకు: భారత ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ ఏపీ జోన్‌లో 42వ నూతన శాఖను తణుకు ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డులో మంగళవారం ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలు వంక రఘువీర్, చిట్టూరి సుబ్బారావు, గమిని రాంబాబుతోపాటు జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ డి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజల అవసరాల మేరకు బ్యాంకు తమ సేవలను అందజేస్తుందన్నారు. తణుకులో మొదటి శాఖను ప్రారంభించినందుకు బ్యాంకు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు


శ్రీకృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సఫల ఏకాదశి పుష్య బహుళ ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలో రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలోని కృష్ణపరమాత్మకు మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. ఉదయం నగర సంకీర్తన, సహస్రనామార్చనలు, స్వామి వారికి, పరివార దేవతలకు భక్తులు నూతన వస్త్రాలు బహుకరణ చేశారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

చిత్రలేఖనం పోటీల్లో తణుకు విద్యార్థినుల ప్రతిభ


బహుమతులు పొందిన తణుకు విద్యార్థినులు


తణుకు టౌన్: నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చిత్రలేఖనం పోటీల్లో తణుకు శ్రద్ధ అకాడమి విద్యార్థినులు పాల్గొని బాల చిత్రకళాశ్రీ అవార్డులు పొందినట్లు అకాడమి నిర్వాహకులు తెలిపారు. ఈపోటీల్లో జూనియర్స్ విభాగంలో తమ అకాడమి ఏడవ తరగతి విద్యార్థినీ కె ఉత్తిష్ఠ, సబ్‌జూనియర్స్ విభాగంలో సీహెచ్ కృతిక బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినులను అకాడమి నిర్వాహకులు సీహెచ్‌వైఎస్ లక్ష్మీ, తల్లిదండ్రులను అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


దంత వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అందరికి అందాలని క్లబ్ ఆర్‌సీ మదన్‌మోహన్ అగర్వాల్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో స్మైల్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి సన్నిధి సూర్యనారాయణ మూర్తి, క్యాబినెట్ నాయకుడు ఎన్‌వీ రమణారావు, జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, పుత్రయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ, మండే మాధూరి, చిక్కాల భ్రమరాంబికా, పడాల కావ్యరెడ్డి, పాండురంగారావు, కైండ్‌నెస్, అభయం, వశిష్ట లియో క్లబ్ సభ్యులు మాధురి, సంపత్, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ఎస్ నాయక్ ఆధ్వర్యంలో ఎంవీఐ పరిధిలోని విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. రహదారి నియమ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా.. ఆకట్టుకునేలా..

- సర్కారు బడుల్లో విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు
- శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు
- ట్యాబ్‌ల పంపిణీపై తల్లిదండ్రుల హర్షం
- తణుకు నియోజకవర్గంలో 2,904 మందికి ఉచిత ట్యాబ్‌లు


తణుకులో ట్యాబ్‌లు అందుకున్న 8వ తరగతి విద్యార్థులతో మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: ఆంగ్ల బోధన అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు డిజిటల్ బోధనాంశాలను మెరుగుపరిచే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేశారు. దీంతో గతంలో ఆర్థిక స్థితి బాగున్న విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉండే సాంకేతిక విద్య ఇప్పుడు పేదవర్గాలకు చెందిన విద్యార్థులకు సైతం చేరువైంది. ఇంతటి సౌకార్యాన్ని పేదవర్గాలకు ఇవ్వడం పట్ల విద్యార్థులతో పాటు తల్లి తండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగార్థం విద్యార్థుల పేరు మీద లాగిన్ ప్రక్రియ పూర్తిచేసి వారికి అందజేశారు.

అంతర్జాలంలో ఉన్న విద్యావనరులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసే క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం బైజూస్ సంస్థ ద్వారా విద్యార్థులకు అవసరమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు ప్రభుత్వం గతేడాది, ఈ ఏడాది ఉచితంగా ట్యాబ్‌లు అందజేసింది. దీంతో బైజూస్ ఇ కంటెంట్‌ను విద్యార్థులు ఎలా తెలుసుకోవాలనే విధానాన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా చూపిస్తుండడంతో విద్యార్థులు తమ ఇళ్ల వద్ద ఈ ట్యాబ్‌లను ఉపయోగించి అంతర్జాలంలో ఉన్న కొన్ని ఇ యాప్‌ల ద్వారా సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల్లో నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఇ కంటెంట్ ద్వారా విషయ సామాగ్రిని విద్యార్థులు సేకరిస్తున్నారు.

పేదల విద్యకు అత్యంత ప్రాధాన్యత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. విద్య ద్వారా సమాజాన్ని అభివృద్ధి చేయాలనే ధృడ సంకల్పంతో ఏపీలో విద్యావ్యవస్థ రూపు రేఖలే మార్చేశారు. ఇందులో భాగమే పేద విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసే ప్రక్రియ. పేద విద్యార్థులెవ్వరూ ట్యాబ్‌లు కొనుగోలు చేయలేని దుస్థితిని గుర్తించి సీఎం జగన్ ఉచితంగా అందజేశారు.

– కత్తుల జోస్‌పాల్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్, తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల

బైజూస్ కంటెంట్ బాగుంది



నాకు గతేడాది ప్రభుత్వం అందచేసిన ట్యాబ్ ద్వారా బైజూస్ కంటెంట్‌ను అంతర్జాలంలో పొందగలిగాను. ఉపాధ్యాయుల విద్యాబోధనకు అదనంగా ఇ కంటెంట్‌ను ట్యాబ్‌ల ద్వారా అందుకోలగుతున్నాం. ముఖ్యంగా సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ట్యాబ్‌ల రూపంలో మంచి కంటెంట్ మాకు అందుబాటులోకి వచ్చింది.

– పి.వర్షిత, 9వ తరగతి విద్యార్థిని, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్.

థ్యాంక్యూ సీఎం సార్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు అందచేసిన ట్యాబ్ నాకు ఉచితంగా రావడం సంతోషంగా ఉంది. ట్యాబ్‌లు ఎలా ఉపయోగించాలనే విషయాన్ని ఇప్పటికే మా ఉపాధ్యాయులు మాకు తెలియజేశారు. వైఫై ద్వారా ఆన్‌లైన్‌లోకి వెళ్లి విద్యావ్యవస్థకు చెందిన 7 యాప్‌ల ద్వారా అంతర్జాలంలో ఉన్న విద్యాసామాగ్రిని ట్యాబ్‌లతో ఉచితంగా అందుకునే వెసులుబాటు మాకు ఏర్పడింది.

– బి.శ్రీహిత్, 8వ తరగతి విద్యార్థి, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్

ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక విద్య అందుబాటులోకి



విద్యార్థుల్లో సాంకేతికతను పెంపెందించే క్రమంలో ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందచేయడం శుభపరిణామం. ఉపాధ్యాయుల పాఠ్యాంశబోధనకు అదనంగా బైజూస్ కంటెంటెంట్‌ను ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు చేరువ చేయడం అభినందనీయం. అంతర్జాలంలో ఉన్న విద్యావనరులను అందిపుచ్చుకునే అవకాశం విద్యార్థులకు చేరువైంది.

– కె.పద్మావతి, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు

తణుకు నియోజకవర్గంలో 2,904 ట్యాబ్‌లు అందజేత

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 2023, 2024 సంవత్సరాల్లో 2904 మంది 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు అందజేసింది. తాజాగా ఈ ఏడాది రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.

గురుకుల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం


బి.రాజారావు

తాడేపల్లిగూడెం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించచున్న 5వ తరగతి ఇంగ్లీషు మీడియం ప్రవేశ పరీక్షలు 2024–2025 విద్యా సంవత్సరానికి గాను బాలురు కోసం తాడేపల్లిగూడెం రూరల్ మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో నిర్వహిస్తున్నందున విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రాజారావు కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి చివరి తేదీ 23.02.2024గా చెప్పారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వయస్సు 1.9.2023 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలని, 2023–24 విద్యా సంవత్సరంలో నాల్గోవ తరగతి చదువుతూ ఉండాలని, తండ్రి సంవత్సర ఆదాయం రూ. లక్ష మించరాదని తెలిపారు. గురుకులంలో 80 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఎస్సీలు 60, బీసీలకు 10, ఎస్టీలకు 5, ఓసీలకు 1 సీటు కలదని వివరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని నల్లంవారితోటకు చెందిన జె.నాగరాజు (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత స్నానానికి వెళ్లి ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చి ఇంటి వెనక్కి వెళ్లి చూడగా వేప చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతు ఉన్నట్లు అతని భార్య దుర్గా మల్లేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

అత్తిలి: మండలంలోని గుమ్మంపాడు -2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటిబచావో–బేటిపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరారు. శారీరకంగా శరీరం ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లలను ఎదగనిద్దాం– ఆడపిల్లలను చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి రాజకుమారి, సహాయకురాలు పి చిట్టిమరియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరిఘేడులో..

తిరుపతిపురం సెక్టార్ వరిఘేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్ బేబి, కె మీనాకుమారి, శ్రీదేవి, జి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో బేటి బచావో–బేటి పఢావో

తాడేపల్లిగూడెం రూరల్: మండలం మాధవరం సెక్టార్ పరిధిలో బేటి బచావో– బేటి పఢావో కార్యక్రమం మంగళవారం జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు మీటింగ్ ఏర్పాటు చేసి, బాలిక విద్య, వివాహ వయస్సు, మైనార్టీ తీరకుండా వివాహాలు చేయరాదని తదితర అంశాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి, గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


జగన్నాథపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలోని భవితా సెంటర్ వద్ద అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బేటి బచావో–బేటి పఢావో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్యలుచే ఆడ పిల్లలను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం, ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ బాలికల హక్కులు కాపాడాలని, వారికి ప్రయోజనాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమారి, రత్నకుమారి, నాగలక్ష్మి, సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


తణుకులో నిరసన ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు

తణుకు అర్బన్: దివ్యాంగులకు 2016 చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ మంగళవారం తణుకులో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. తణుకు దివ్యాంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ఉద్దేశించి అధ్యక్షుడు వేంద్ర లక్ష్మణ్ మాట్లాడుతూ అర్హత కలిగి ఉన్న ప్రతి దివ్యాండుగుడికి విద్యతో సంబంధం లేకుండా మూడు చక్రాల మోటారు సైకిల్ ఇవ్వాలని, పింఛను రూ. 7వేలకు పెంచాలని, గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేసివ్వాలని కోరారు. దివ్యాంగులు వివాహం చేసుకుంటే విద్యతో సంబంధం లేకుండా రూ. 3.50 లక్షలు పెళ్లికానుకగా అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తణుకు బాయ్స్ హైస్కూల్ ప్రాంతం నుంచి ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు ఎస్.అంజి, కె.వెంకటేశ్వరరావు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అన్నారు. అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ 38వ వార్షికోత్సవం, కార్మిక నాయకులు వర్రి అప్పల సత్యం సంతాప సభ మంగళవారం చుక్కా అప్పలస్వామి భవనం వద్ద నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు చౌకగా కట్టబెట్టడం దారణమన్నారు. అనంతరం నూతన కార్యవర్గంను ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా కరెడ్ల రామకృష్ణ, అధ్యక్షుడిగా గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా అయినాల సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శి నర్మాల నారాయణరావు, కోశాధికారి అగుర్తుల రామ్మోహన్‌రావు, సభ్యులు దాసరి రాజు, సుందరపు అప్పల నాయుడు, రావి శ్రీనివాసరావు, నీరుకొండ రమణ, ఇల్ల గోవిందరావు, బద్ధి నాగేశ్వరరావు, పి.గోవిందు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావులను ఎంపిక చేశారు.

రైతు సంఘాలకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి


రైతులతో ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని ఉద్యానవర్సిటీలో మంగళవారం జరిగిన 13వ శాస్త్రీయ సలహామండలి సమావేశంలో శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ సాంకేతిక ప్రయోగసంస్థ డైరెక్టర్ షేక్ ఎస్.మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా డ్రోన్ పదర్శనలను ప్రోత్సహించాలన్నారు. మహిళలకు ఈ విషయంలో శిక్షణ ఇవ్వాలన్నారు. జీవనియంత్రణ కారకాలను పంపిణీ చేయాలన్నారు. ఉద్యానపంటల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల నిర్వహణ, కమ్యూనిటీ రేడియో స్టేషన్ సేవలను జిల్లా అంతా విస్తరించాలన్నారు. వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ కెవికెల ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించే దిశగా పనిచేస్తున్నామన్నారు. వర్సిటీ ద్వారా విడుదల చేసిన నూతన మిరప, దుంపజాతి పంటలు, కూరగాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేర్పించాలన్నారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ , కెవికె శాస్త్రవేత్తలు , వర్సిటీ అధికారులు, పాల్గన్నారు.గిరిజన రైతులకు మేక పిల్లలను, పశువుల దాణాను అందజేశారు.

డ్రైవర్లకు ఏకాగ్రత అవసరం


రోడ్డు భద్రతా వారోత్సవాల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యలక్ష్మి

తణుకు అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లంతా కంటినిండా నిద్ర, విశ్రాంతి, మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సత్యలక్ష్మి అన్నారు. ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ మంచి అలవాట్లను అనుసరిస్తే తమ విధి నిర్వహణలో ఏకాగ్రత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కొత్తలంక శేఖర్, ఆయిల్ డీసీ మహమ్మద్ ఆలీ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ ప్రసాద్, డీఎంఈ షేక్ లాల్, ఎస్‌డీఐ కల్యాణ్‌రాజు, ఏడీసీ రామకృష్ణ, యామిని, అరుణ, డిపో సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, కండక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు ఎంపీడీవోగా శ్రీలలిత

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా (ఎంపీడీవో) డీ శ్రీలలిత మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా తణుకు ఎంపీడీవోగా పని చేసిన కె కిరణ్ కుమార్‌ను కృష్ణా జిల్లాకు బదిలీ కాగా, తణుకు ఎంపీడీవో శ్రీలలితను నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు.

కోర్టు డైరీలు ఎంతో ప్రయోజనకరం

భీమవరం: ఐఏఎల్ వాల్ క్లాక్, కోర్టుడైరీలు న్యాయవాదులకు, కోర్టు సిబ్బంది, పోలీసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఐఏఎల్ రూపొందించిన క్యాలెండర్, గడియారాలు, డైరీలను మంగళవారం భీమవరం కోర్టులో ఆవిష్కరించారు. ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంవీ రమణరావు, కార్యదర్శి పాకా రమేష్, ఐఏఎల్ నాయకులు పి.సునీల్‌కుమార్, మేకా శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు మద్యం సీసాల స్వాధీనం

భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలోని నాచువారి సెంటర్లోని ఒక దుకాణం వద్ద 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారంమేరకు మంగళవారం నాచువారి సెంటర్‌లోని ఓ షాపు దాడి చేసి షాపు నిర్వాహకుడు ఆర్.శ్రీనివాసరావు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఘనంగా 73వ ఈఎస్ఐ ఫౌండేషన్ వేడుకలు


ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఈఎస్ఐ కార్యాలయం వద్ద ఈఎస్ఐ 73వ ఫౌండేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద పదిహేను రోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్త చెదారాలను తొలగించారు. ఈఎస్ఐ ఐఎంఓ డాక్టర్ కొల్లి బాబు, పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి


గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం ఇస్తున్న చాందిని కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు తగు జాగ్రతలు తీసుకోవాలని గల్ఫ్‌హెల్ప్ నిర్వాహకులు, లయన్స్ జిల్లా గవర్నర్ గట్టి మాణిక్యాలరావు అన్నారు. ఆచంట మండలం చినపేట గ్రామానికి చెందిన చాందిని కత్తర్ దేశానికి వెళ్లగా అక్కడ ఆమె అనారోగ్యానికి గురై, ఇతర ఇబ్బందులు పడుచున్నట్లు, ఇండియాకు పంపేందుకు అక్కడ ఏజెంట్‌లు నిరాకరించారని, ఇక్కడ ఏజెంట్లు సైతం ఒక లక్ష యాభై వేలు రూపాయిలు అడిగారని చాందిని కుటుంబ సభ్యులు గట్టిం మాణిక్యాలరావు దృష్టికి తీసుకువచ్చారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా అంత సొమ్ము చెల్లించలేమని, తమను ఆదుకోవాలని గట్టింకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ చాందినిని ఇండియాకు రప్పిస్తానని హామీ ఇచ్చారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న దూసనపూడి సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈ నెల 16న కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ పిలుపునిచ్చింది. ఏఐటీయుసీ ఏరియా సమావేశం మంగళవారం పట్టణంలోని సిపాయి పేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మిక, రైతు సంఘాల సంయుక్త కార్యాచరణ వేదిక పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. అనుబంధ కార్మిక సంఘాలను సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వమే సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయుసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.


సమర్థవంతమైన విద్యే లక్ష్యం



ఉద్యాన విద్యా సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన విద్యాబోధనలో మార్పులు చేసి, సాంప్రదాయ బోధనా విధానం , ఆధునిక సాంకేతిక సాధనాలను ఉపయోగించి విద్యార్థులకు సమర్థవంతమైన విద్యే లక్ష్యంగా కృషి చేస్తున్నామని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థల నుంచి ఐటీ నిపుణులు, శిక్షకులు రిషబ్ సిన్హా తెలిపారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో మంగళవారం నాణ్యమైన ఉద్యాన విద్య , మిశ్రమ జ్ఞానార్జన అనే కార్యక్రమంపై వర్కుషాపు నిర్వహించారు. వీసీ టి.జానకీరామ్, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీస్టడీస్ ఎస్,.సూర్యకుమారి, అసోసియేట్ డీన్ ఎమ్.మాధవి తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

విజయకేతనం మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ప్రభుత్వ బేసిక్‌స్కూల్ పదో తరగతి విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

పెంటపాడు: పదోతరగతి విద్యార్థులు ప్రభుత్వం అందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకొని పరిజ్ఞానం పెంపొందించుకోవాలని పెంటపాడు ఎంఈవో ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్‌లో విజయకేతనం మెటీరియల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం రాజేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

భీమవరం అర్బన్: మండలంలోని అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ బీకేఎస్ఎస్ వెంకటరమణ సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ తదితర శాఖలలో అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రణావ్ తదితరులు పాల్గొన్నారు.